
మన అంకుశం
అవినీతిపై అక్షర సమరం
సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 114 | శుక్రవారం 14 ఆగస్టు 2026 | పేజీలు : 4 | వెల : 3/-


# తాగునీటి కొరత రానీయొద్దు

**రాష్ట్రంలోని రిజర్వాయర్లలో నీటి నిల్వలు, నీటి విడుదల, తాగు నీటి సరఫరా నిర్వహణ ప్రణాళిక, జలధార- జలహారతి కార్యక్రమాల అమలుపై సీఎం అధికారులకు దిశానిర్దేశ**

**నెలవారీ లక్ష్యాలతో ప్రాధాన్యతా ప్రాజెక్టులు పూర్తి**

**అన్నమయ్య ప్రాజెక్టు ఆయకట్టుకు నీరిచ్చే అంశంపై అధ్యయనం**

**జలవనరుల శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు**





**(అంకుశం, అమరావతి, ఆగస్టు 14):**
రాష్ట్రంలో వాటర్ మూమెంట్ ప్లాన్ ప్రకారమే నీటి నిర్వహణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రస్తుతం లోటు వర్షపాతం పరిస్థితుల నేపథ్యంలో రిజర్వాయర్లు, చెరువుల్లో నీటి నిల్వల్ని, భూగర్భ జలాలను సద్వినియోగం చేసుకునేలా కార్యాచరణ ఉండాలని సూచించారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం జల వనరుల శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. పోలవరం, వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతి, ప్రాధాన్యతా క్రమంలో చేపట్టనున్న 36 ప్రాజెక్టులు, రాష్ట్రంలోని రిజర్వాయర్లలో నీటి నిల్వలు, నీటి విడుదల, తాగు నీటి సరఫరా నిర్వహణ ప్రణాళిక, జలధార-- జలహారతి కార్యక్రమాల అమలుపై సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలవరం ప్రాజెక్టులో ఇప్పటి వరకూ 89.9 శాతం మేర సివిల్ పనులు పూర్తి అయ్యాయని - మిగతా2లో

## విద్యుత్ దీపాల వెలుగులో అసెంబ్లీ, సచివాలయ భవనాలు

**(అంకుశం, అమరావతి,ఆగస్టు 14):**





భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ,సచివాలయ భవనాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ప్రతిబింబించేలా సచివాలయంలోని ఐదు భవనాలను ప్రత్యేక విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దారు.అసెంబ్లీ భవనాన్ని సైతం వివిధ రకాల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించడంతో భవన సముదాయం విద్యుత్ కాంతులతో మిరుమిట్లు గొలుపుతోంది.అసెంబ్లీ,సచివాలయ ప్రాంగణాల్లోని రహదారులకు ఇరువైపులా, సెంట్రల్ పార్కులో వివిధ రంగులతో కూడిన ప్రత్యేక విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు.దీంతో మొత్తం ప్రాంగణం విద్యుత్ వెలుగులతో శోభాయమానంగా మారి పండుగ వాతావరణాన్ని తలపిస్తోంది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా విజయవాడలోని లోక్ భవన్, ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం,ప్రకాశం బ్యారేజ్,ప్రఖ్యాత ఉండవల్లి గుహలు,ఇతర చారిత్రక ప్రాముఖ్యత కలిగిన భవనాలు, ప్రముఖ కట్టడాలను సైతం విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో ఈ ప్రత్యేక విద్యుత్ అలంకరణలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ, సచివాలయ భవనాలకు మరియు నగరానికి మరింత శోభను తీసుకువచ్చాయి.

## హైకోర్టు న్యాయమూర్తి బీవీఎల్ఎన్ చక్రవర్తికి ఘన వీడ్కోలు

**(అంకుశం, అమరావతి, ఆగస్టు 14):**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి బీవీఎల్ఎన్ చక్రవర్తికి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ ఆధ్వర్యంలో ఫుల్ బెంచ్ సమక్షంలో ఘన వీడ్కోలు పలికారు.హై కోర్టు న్యాయమూర్తి బీవీఎల్ఎన్ చక్రవర్తి పదవీ విరమణ చేయనున్న సందర్భాన్ని పురష్కరించుకుని హైకోర్టు మొదటి కోర్టు హాల్లో శుక్రవారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ మాట్లాడుతూ జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి నిబద్ధత కలిగిన న్యాయమూర్తని కొనియాడారు.జస్టిస్ చక్రవర్తి తన పదవీ కాలంలో అనేక కీలకమైన తీర్పులను వెలువరించారని న్యాయ వ్యవస్థకు విశేష సేవలందించారని అభినందించారు.ఐటీ రంగంలో ప్రభజంనం సష్టించిన సత్యం కంప్యూటర్స్ కుంబకోణం కేసులో ప్రత్యేక - మిగతా2లో



## అసిస్టెంట్ కమాండెంట్ బాషాకు 'ఇండియన్ పోలీస్ మెడల్'

**(అంకుశం, అమరావతి, ఆగస్టు 14):**
రెండు దశాబ్దాలకు పైగా పోలీస్ శాఖలో విశిష్ట, ప్రశంసనీయమైన సేవలు అందించిన ఆంధ్రప్రదేశ్ పోలీస్ అకాడమీ అసిస్టెంట్ కమాండెంట్ (డీఎస్పీ ర్యాంక్) సయ్యద్ మహబూబ్ బాషాను భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మక 'ఇండియన్ పోలీస్ మెడల్'కు ఎంపిక చేసింది. విధి నిర్వహణ పట్ల అసాధారణమైన అంకితభావం, నిబద్ధత, నిష్కళంకమైన నిజాయితీ ఇంకా ఆదర్శప్రాయమైన వత్తి నైపుణ్యాన్ని కనపరించినందుకు అత్యున్నతమైన జాతీయ 'ఇండియన్ పోలీస్ మెడల్' పురస్కారంతో సత్కరించనున్నారు. సయ్యద్ మహబూబ్ బాషా 1998లో పోలీసు శాఖలో చేరి, ప్రజారక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ , సంస్థాగత శ్రేష్ఠతకు అంకితమై విశేష సేవలు అందించారు. ప్రస్తుతం ఆయన ఆంధ్రప్రదేశ్ పోలీస్ అకాడమీలో అసిస్టెంట్ కమాండెంట్ / డీఎస్పీగా బాధ్యతలు నిర్వర్తిస్తూ, పోలీసు అధికారుల శిక్షణ, పరిపాలనా వ్యవహారాలలో కీలక పాత్ర పోషిస్తున్నారు. తన 28 ఏళ్ల సుదీర్ఘ సర్వీసులో కనబరిచిన అచంచలమైన క్రమశిక్షణ, సమర్థవంతమైన నాయకత్వం , కర్తవ్య నిష్టకు ఈ జాతీయ పురస్కారం నిదర్శనంగా నిలిచింది. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అందనున్న 'ఇండియన్ పోలీస్ మెడల్' పురస్కారాన్ని ఆయన అందుకోనున్నారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపికైన సందర్భంగా ఏపీ పోలీస్ అకాడమీ సీనియర్ అధికారులు, తోటి సహోద్యోగులు, సిబ్బంది , పోలీస్ ఉన్నతాధికారులు, మిత్రులు సయ్యద్ మహబూబ్ బాషా కి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో దేశ సేవలో ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.



## రూ. 40 కోట్లతో అగ్నిమాపక అధునాతన వాహనాలు

**జెండా ఊపి వాహనాలను ప్రారంభించిన సీఎం చంద్రబాబు**

**(అంకుశం, అమరావతి, ఆగస్టు 14):**



అగ్నిప్రమాదాలు, విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడేందుకు అగ్నిమాపకశాఖను మరింత ఆధునికంగా తీర్చిదిద్దుతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో కొనుగోలు చేసిన సుమారు రూ.40 కోట్ల విలువైన 58 అగ్నిమాపక వాహనాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. సీడ్ యాక్సెస్ రోడ్డులో ఫైర్ సేఫ్టీ వాహనాలకు సీఎం జెండా ఊపారు. అగ్నిమాపక శాఖ అధికారులు ఆ వాహనాల ప్రత్యేకతలను సీఎంకు వివరించారు. అలాగే గ్రామీణ, అటవీ ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితులకు ఉపయోగపడేలా... ప్రమాద ప్రాంతాలకు వేగంగా చేరుకుని తక్షణమే అగ్నిమాపక సేవలు అందించేలా రూ.18.68 కోట్ల విలువైన 25 అధునాతన అగ్నిమాపక వాహనాలు అందుబాటులోకి వచ్చాయని అధికారులు తెలిపారు. పెద్ద అగ్నిప్రమాదాల సమయంలో నిరంతర నీటి సరఫరాకు ఉపయోగపడేలా రూ.14.79 కోట్ల విలువైన 20 వాటర్ బౌజర్లను సిద్ధంగా ఉంచుకున్నామని సీఎంకు అధికారులు చెప్పారు. ఒక్కో వాటర్ బౌజర్ 14 వేల లీటర్ల నీటిని తరలించే సామర్థ్యం కలిగి ఉంటాయని... పట్టణ, పారిశ్రామిక ప్రాంతాల్లో మంటలను అదుపు చేయడంలో ఇవి కీలకంగా వ్యవహరిస్తాయని తెలిపారు. ఇరుకైన, రద్దీగా ఉండే ప్రాంతాల్లోనూ వేగంగా చేరుకునేలా రూ.6.37 కోట్ల విలువైన 13 క్విక్ రెస్పాన్స్ మల్టీపర్పస్ ఫైర్ ఫైటింగ్ వాహనాలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించినట్టు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో మొత్తం రూ.252.86 కోట్ల వ్యయంతో దశలవారీగా ఆధునిక వాహనాలు, పరికరాలను సమకూరుస్తున్నాం. తొలిదశలో రూ.33 కోట్ల వ్యయంతో 65 అగ్నిమాపక వాహనాలను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చాం. రెండో దశలో రూ.40 కోట్లతో 58 వాహనాలను ఇప్పుడే ప్రారంభించుకున్నాం. ఇక త్వరలో మూడో దశలోనూ మరిన్ని అగ్నిమాపక వాహనాలు, ఫైర్ ఫైటింగ్ పరికరాలను అందుబాటులోకి తీసుకురానున్నాం. కార్యక్రమంలో హోంమంత్రి అనిత, అగ్నిమాపక శాఖ డీజీ వెంకటరమణ సహా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జాతీయ సమైక్యతను పెంపొందించడమే లక్ష్యం







**హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ను విజయవంతం చేయాలి....**

**డి ఆర్ ఓ . ఎ .మాలోల**

**అనంత లో భారీ ఎత్తున జరిగిన ర్యాలీలో రెపరెప లాడిన త్రివర్ణ పతాకం...**

**అంకుశం న్యూస్అనంతపురం, ఆగస్టు 14:** "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం జిల్లా ప్రభుత్వ యంత్రాంగం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున భారీగా నిర్వహించిన ర్యాలీ ప్రజలకు ఎంతో స్ఫూర్తినిచ్చి దేశభక్తిని చాటుకుంది. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాలోల ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండా ను ఆవిష్కరించి, ర్యాలీని ప్రారంభించారు. ఆర్ట్స్ కాలేజీ నుండి ప్రారంభమైన ఈ భారీ ప్రదర్శన ర్యాలీ లో 80 అడుగుల పొడవైన జాతీయ పతాకాన్ని విద్యార్థులు ,అధికారులు, ఉపాధ్యాయులు , యువతీ యువకులు,స్వయం సహాయక మహిళాసంఘాల సభ్యులు,ప్రభుత్వఉద్యోగులు, స్వచ్ఛంద సేవాసంస్థలు స్థానిక ప్రజలు, ఎన్ఎస్ఎస్, యన్ సి సి, నర్సింగ్ కాలేజీవిద్యార్థులు , మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగసిబ్బంది, పలువురు క్రీడాకారులు వాకర్సు తదితరులు అత్యంత భక్తిశ్రద్ధలతో చేత బూని "మేరా భారత్ మహాన్" "వందేమాతరం"భారత్ మాతాకీ జై అంటూ చేసిన నినాదాలు అనంత ప్రధాన వీధులలో దేశభక్తి, జాతీయసమైక్యత, సోదర భావం మరియు దేశ ప్రగతి పట్ల సమాజంలో భావం ఉప్పొంగింది. అలాగేకన్నుల పండుగగా జన సందోహం మధ్య ఘనంగా జరిగింది. అంతకు ముందు ఆర్ట్స్ కాలేజీ మైదానంలో అటవీ శాఖఆధ్వర్యంలోఏర్పాటుచేసిన పలు మొక్కలను డిఆర్ఓ నాటారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూఅధికారిమాలోలమాట్లాడుతూ ప్రపంచంలో మన భారత దేశం విభిన్న సంస్కృతి,సాంప్రదాయాలకు నిలయంగా ఉందన్నారు. అలాగే జాతీయ జెండా మన భారతదేశ సార్వ భౌమా ధికారానికిత్యాగానికి జాతీయ సమైక్యతకు ప్రతీకగాఉండిమాతృభూమి స్వాతంత్రం కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలను స్పందించుకోవడానికి "హర్ ఘర్ తిరంగా " కార్యక్రమం ఒక గొప్ప అవకాశం అని సమాజంలోని ప్రతి ఒక్కరూ దేశభక్తిని మరియు జాతీయ సమైక్యతను పెంపొందించు కోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 80 వ భారత దేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై వ్యాపార సముదాయాలపై స్వచ్ఛందంగా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసిదేశభక్తి స్ఫూర్తిని చేటాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత తరుణంలో ప్రజలు నేటి యువత , విద్యార్థులు జాతీయభావాన్నిమరింతగా అలవర్చుకోవాలని దేశభక్తి ఐక్యతను పెంపొందించ దంతోపాటు జాతీయ జెండాపై పెంచుకోవాలని సూచించారు. ఈ ర్యాలీలో వేలాదిమంది పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి డిఆర్ఓ తన ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్ డి ఓ కుమార్, డీఎఫ్ఓ గురు ప్రభాకర్, జిల్లా టూరిజం అధికారి రమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ జస్వంత్ రావు, డీఈవో అయుబ్ హుస్సేన్, బీసీ సంక్షేమ శాఖ అధికారి కుష్బూ కొఠారి , ఐసిడిఎస్ పిడి సాజిదున్నిసా, మెప్మా పిడి విశ్వ జ్యోతి, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మశ్రీ, ఆర్ ఐ ఓ వెంకటరమణ నాయక్ , డి ఐ పి ఆర్ ఓ బాల కొండయ్య, ఆర్కాలజీ ఏడి స్వామి నాయక్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ సూగప్ప, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి మంజుల, ఆన్ సెట్ మేనేజర్ శ్రీనివాసులు, యూత్ వెల్ఫేర్ అన్వర్ భాష, తదితరులు పాల్గొన్నారు.

# మానసిక ఆరోగ్య సంక్షేమ కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ సంక్షేమ మాసం.



బుక్కరాయ సముద్రం అంకుశం న్యూస్ ఆగస్టు 14 ఆగస్టు నెలను జాతీయ సంక్షేమ మాసంగా గమనిస్తున్న సందర్భంగా, ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం మనస్తత్వ శాస్త్ర విభాగంలోని మానసిక ఆరోగ్యం--సంక్షేమ కేంద్రం ఆధ్వర్యంలో 'ఓపెన్ మైక్ వెల్‌నెస్' కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ ఆలోచనలు, భావాలను స్వేచ్ఛగా వ్యక్తపరచడంతో పాటు, తమ ప్రతిభను ప్రదర్శించేందుకు, ప్రకృతితో తమకున్న అనుబంధాన్ని గుర్తించి, గౌరవించి, ఆనందించేందుకు ఈ కార్యక్రమం వేదికగా నిలిచింది. వ్యక్తి సంక్షేమం తన చుట్టూ ఉన్న ప్రపంచంతో ఏర్పరచుకునే సంబంధంతో సన్నిహితంగా ముడిపడి ఉంటుందనే భావన ఆధారంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. సంగీతం, కవిత్వం, హాస్యం, నృత్యం వంటి సృజనాత్మక ప్రక్రియల ద్వారా విద్యార్థులు ప్రకృతితో తమకున్న అనుబంధాన్ని వివిధ రూపాల్లో ఆవిష్కరించారు. అదే సమయంలో, అర్థవంతమైన అనుబంధాలు ఆరోగ్యకరమైన, సమతుల్యమైన జీవనానికి ఎలా దోహదపడతాయో తెలియజేశారు. ఈ ఓపెన్ మైక్ కార్యక్రమంలో నాలుగు సృజనాత్మక విభాగాలు ఉన్నాయి. అవి 'ఎకో–సింగింగ్', 'ఎకో–పోయెట్రీ', 'ఎకో–కామెడీ', 'ఎకో–డాన్స్'. ప్రతి విభాగం ద్వారా విద్యార్థులు ప్రకృతితో తమకున్న అనుబంధాన్ని తమదైన ప్రత్యేక శైలిలో వ్యక్తపరిచే అవకాశం పొందారు. ప్రకృతి అందాలను ప్రతిబింబించే పాటలు; పర్యావరణ బాధ్యతను ప్రతిఫలించే కవితలు; పర్యావరణ సమస్యలను హాస్యభరితంగా ఆవిష్కరించిన ప్రదర్శనలు; మానవుడు--ప్రకృతి మధ్య సామరస్యాన్ని ప్రతిబింబించే నృత్య ప్రదర్శనలు కార్యక్రమాన్ని సృజనాత్మకత, సంక్షేమంతో మేళవించిన ప్రత్యేక అనుభూతిగా నిలిపాయి. ప్రకృతితో అనుబంధం – ఆనందం, సృజనాత్మకత, భావోద్వేగ పునరుత్తేజానికి మూలంగా నిలుస్తుందని ఈ కార్యక్రమం స్పష్టం చేసింది. కొంతసేపు ఆగి తమను తాము వ్యక్తపరచడం, ఇతరుల భావాలను ఆలకించడం, ప్రకృతి ప్రపంచంతో తమకున్న సంబంధాన్ని ఆస్వాదించడం ద్వారా విద్యార్థుల్లో సమష్టి సంక్షేమ భావనను పెంపొందించే అనుకూల వాతావరణాన్ని ఈ కార్యక్రమం కల్పించింది. ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్. ఏ. కోరి మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. బి. కివడే, విద్యా విభాగం డీన్ ఆచార్య సి. షీలా రెడ్డి, మనస్తత్వ శాస్త్ర విభాగాధిపతి డా. ఆకృతి శ్రీవాస్తవ తదితర ఉన్నతాధికారులు కార్యక్రమ నిర్వహణకు తమ సహకారాన్ని అందించారు. మనస్తత్వ శాస్త్ర విభాగంలోని మానసిక ఆరోగ్యం--సంక్షేమ కేంద్రం కౌన్సిలర్లు మధు గిరి, అనస్ తయ్యిల్ సమన్వయంతో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో స్నాతక, స్నాతకోత్తర విద్యార్థులతో పాటు అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కుల, మత, వర్ణ, ప్రాంత భేదాలకు అతీతంగా ప్రజల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, పర్యావరణ పురోగతిని పెంపొందిస్తూ, జ్ఞానంతో నిండిన సమాజ నిర్మాణానికి అవసరమైన విద్యను అందించడంతో పాటు, వ్యక్తిగత సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధిని ప్రోత్సహించే విద్యా వాతావరణాన్ని కల్పించాలనే ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం నిబద్ధతను ఈ కార్యక్రమం మరోసారి చాటిచెప్పింది.

# పార్లమెంట్‌లో పోటాపోటీ నిరసనలు



జులై 20న ప్రారంభమైన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు గందరగోళం మధ్య ముగిశాయి. గురువారం ఉభయ సభలు ప్రారంభమైన కొద్దిసేపటికే నిరవధికంగా వాయిదా పడ్డాయి. సమావేశాల ముగింపు కూడా అధికార, విపక్షాల మధ్య తీవ్ర రాజకీయ ఘర్షణకు వేదికగా మారింది. పార్లమెంట్ ప్రాంగణంలోని మకర్ ద్వార్ వద్ద బీజేపీ, ప్రతిపక్ష ఎంపీలు పోటాపోటీగా నిరసనలు చేపట్టారు. గురువారం ఉదయం లోక్‌సభ ప్రారంభం కాగానే జాతీయ గీతం వందేమాతరంలోని మొత్తం 6 చరణాలను ఆలపించారు. ఆ వెంటనే సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. సాధారణంగా సమావేశాలు ముగిసే రోజున సభ పనితీరును, ఉత్పాదకతను వివరిస్తూ స్పీకర్ చేసే ముగింపు ప్రసంగం ఈసారి జరగలేదు. సభ వాయిదా పడిన సమయంలో ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సభలో కొద్దిసేపు ఉన్నారు. ఝార్ఖండ్‌లో కొనసాగుతున్న ఆందోళనలపై కాంగ్రెస్ పార్టీ స్పందించడం లేదంటూ బీజేపీ నేతలు ఆరోపించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీరును నిరసిస్తూ మకర్ ద్వార్ వద్ద బీజేపీ ఎంపీలు ఆందోళన చేపట్టారు. ప్రజా సమస్యలపై విపక్షం బాధ్యతగా వ్యవహరించాల్సి ఉండగా, సభా కార్యకలాపాలను అడ్డుకోవడానికే ప్రాధాన్యం ఇస్తోందని అధికార పక్షం విమర్శించింది. బీజేపీ నిరసనకు కొద్దిసేపటికే విపక్ష ఎంపీలు కూడా అక్కడే ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ ఎంపీ పవన్ ఖేడా నేతృత్వంలో జరిగిన ఈ నిరసనలో ఓ బొమ్మ కోతిని ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. '56 అంగుళాల చిన్న కోతి లోపలికి రా' అంటూ చేసిన నినాదాలు రాజకీయంగా వివాదానికి దారితీశాయి. అధికార పక్ష నేతలు ఈ నిరసన తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

**'సభ నడపాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే'**

సభ సజావుగా సాగకపోవడానికి విపక్షాన్ని నిందించడం సరికాదని ప్రతిపక్షాలు ఎంపీలు అన్నారు. పార్లమెంట్‌ను నిర్వహించడం ప్రభుత్వ బాధ్యత అని తృణమూల్ కాంగ్రెస్ సీనియర్ ఎంపీ సౌగత రాయ్ అని స్పష్టం చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటన వినేందుకు విపక్షం సిద్ధంగా లేదన్న ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. ఝార్ఖండ్ అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరామని, ఎవరి ఆదేశాలతో పెల్లెట్ గన్ కాల్పులు జరిగాయో చెప్పాలని డిమాండ్ చేశామని తెలిపారు. కానీ ప్రభుత్వం నుంచి సరైన వివరణ రాలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ఎంపీ గుర్జీత్ సింగ్ ఔజ్లా కూడా సభ వాషౌట్‌కు ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. గత 20 రోజులుగా పార్లమెంట్‌లో ఉండి సమస్యలపై చర్చకు ఎందుకు ముందుకు రాలేదని ప్రశ్నించారు. సమావేశాలు ముగియడానికి చివరి రోజు మాత్రమే కేంద్ర హోంమంత్రి చర్చకు సిద్ధమని చెప్పడం వల్ల ప్రయోజనం ఏమిటని నిలదీశారు.

**విపక్షమే సభను అడ్డుకుందని బీజేపీ ఆరోపణ**

మరోవైపు అధికార పక్షం కూడా విపక్ష ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీనే సభా కార్యకలాపాలను అడ్డుకుంటున్నారని బీజేపీ నేతలు ఆరోపించారు. కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ మాట్లాడుతూ, పార్లమెంటరీ వ్యవస్థ ప్రకారం సభ నడుస్తుందని, దానిని ఎవరి వ్యక్తిగత వ్యవహారంలా మార్చలేరని అన్నారు. రాహుల్ గాంధీ తన రాజకీయ ప్రభావంతో వరుసగా కేంద్ర మంత్రులు, ప్రధానమంత్రి రాజీనామా చేయాల్సి వస్తుందని భావించడం సరికాదని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో నిర్ణయాలు వ్యవస్థ ప్రకారమే జరుగుతాయని చెప్పారు.

**వరుస అంతరాయాలతోనే సమావేశాలు**

ఈసారి వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి సభలో తరచూ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. అధికార, విపక్షాల ఆందోళనలతో సభలు దద్దరిల్లాయి. నీట్ పేపర్ లీకేజీ, విద్యార్థులపై లాఠీచార్జ్, అయోధ్య విరాళాల చోరీ వంటి అంశాలపై నిరసిస్తూ ప్రతిపక్షాలు సభను అడ్డుకున్నాయి. ముఖ్యంగా విద్యార్థులపై లాఠీచార్జ్ ఘటనపై హోంమంత్రి అమిత్ షా జవాబు చెప్పాలని విపక్షాలు చేసిన డిమాండ్ సభను కుదిపేసింది. మరోవైపు ఝార్ఖండ్ నిరసనలపై రాహుల్ గాంధీ స్పందించాలంటూ బీజేపీ ఎంపీలు నిరసనలు చేశారు. సభ లోపలే కాకుండా పార్లమెంట్ ప్రాంగణంలోనూ ఇరు పక్షాలు పరస్పర నిరసనలకు దిగాయి. చివరి రోజు కూడా అదే పరిస్థితి కొనసాగడంతో సభలు నిరవధిక వాయిదా వేశారు. దీంతో చర్చలు, రాజకీయ ఆరోపణలు, నిరసనల మధ్య సాగిన వర్షాకాల సమావేశాలకు అధికారికంగా తెరపడింది. అయితే గురువారం చివరిరోజు కావడంతో అమిత్‌షా ఈ అంశంపై సమాధానం చెబుతారని అంతా భావించారు. ఆయన కూడా విపక్షాల ప్రతీ ప్రశ్నకూ సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నట్లు బుధవారం ప్రకటించారు. అందుకు సమయం కేటాయించాలని స్పీకర్‌ను సైతం కోరారు. అయినప్పటికీ, సభను నిరవధికంగా వాయిదా వేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు.

## తాగునీటి కొరత రానీయొద్దు

-మొదటిపేజీ తరువాయి

అధికారులు వివరించారు. పోలవరం ఎడమ కాలువ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నట్టు జల వనరుల శాఖ సీఎంకు తెలియచేసింది. ఈసీఆర్ఎఫ్ గ్యాప్ 1, గ్యాప్ 2 పనులు శరవేగంగా చేపట్టామని వివరించారు. ఇటీవల 14 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహాలు గోదావరికి వచ్చినా ప్రాజెక్టు పనులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనసాగించినట్టు తెలిపారు. డ్యామ్ సైట్ వద్ద రహదారులతో పాటు డ్యామ్ నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాల పనులు కూడా చేపట్టాలని సీఎం సూచించారు. ప్రాజెక్టు సమీపంలో గండి పోశమ్మ ఆలయాన్ని పరిరక్షిస్తూ స్థానికుల సెంటిమెంట్ ను కాపాడేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వచ్చే ఏడాది మార్చి కల్లా విశాఖ వరకూ ఎడమ కాలువ బ్యాలెన్సు పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈలోగా అనకాపల్లి వరకూ ఉన్న నీటి వనరులు, రిజర్వాయర్లు, చెరువుల్లో నీటిని నింపాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. పోలవరం కుడి ఎడమ కాలువల్లో 17,500 క్యూసెక్కుల నీటి ప్రవాహానికి అనుగుణంగా పనులు చేయాలని స్పష్టం చేశారు. రెండు కాలువలకూ మంచి పేర్లను సూచించాలని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు సమీపంలోని ప్రాంతాలను సద్వినియోగం చేసుకోవటంతో పాటు పర్యాటకం గానూ తీర్చిదిద్దాలన్నారు. పుష్కలంగా నీటి వనరులు ఉన్న రాష్ట్రంగా గోదావరి నీటిని అటు ఉత్తరాంధ్రకు, ఇటు కృష్ణా డెల్టా ప్రాంతానికి అవసరమైనంత మేర నీరు తీసుకునే ఆస్కారం ఉందన్నారు. విశాఖ నుంచి అమరావతి వరకూ అంతర్గత జల రవాణా మార్గాలతో అనుసంధానించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా జలవనరుల శాఖ ఆధీనంలో ఉన్న భూముల్ని సద్వినియోగం చేసుకునే అవకాశాలను అధ్యయనం చేయాలని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేయటంతో పాటు నిర్వాసితుల సమస్యల్ని కూడా మానవతా దక్పథంతో పరిష్కరించాలన్నారు. 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోకా పూర్తి చేయాలన్నారు. దీనికోసం నెల వారీ లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు దిగువన ఆయకట్టుకు నీరిచ్చే అంశాన్ని కూడా అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. ఈ సమీక్షకు జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఈఎన్సీ, సీఈలు హాజరయ్యారు.

## హైకోర్టు న్యాయమూర్తి బీవీఎల్ఎన్ చక్రవర్తికి ఘన వీడ్కోలు

-మొదటిపేజీ తరువాయి

సీబీఐ కోర్టు న్యాయమూర్తిగా చారిత్రాత్మక తీర్పును ఇచ్చారన్నారు.ప్రధాన నిందితుడితో పాటు 10 మందికి 7 సంవత్సరాల శిక్షను విధించి కీలకమైన తుది తీర్పును వెలువరించారని వివరించారు.జస్టిస్ చక్రవర్తి సివిల్, క్రిమినల్ మరియు పబ్లిక్ సర్వెంట్ మిస్‌కండక్ట్ వంటి అనేక కేసులను విచారించారని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ పేర్కొన్నారు. జస్టిస్ చక్రవర్తి తూర్పు గోదావరి జిల్లా కందులపాలెం గ్రామంలో బి.పాపారాయ చౌదరి, విజయలక్ష్మీ దంపతులకు 1964లో జన్మించారని,తామరపల్లి, గంగవరంలో ప్రాథమిక, హైస్కూల్ విద్యను పూర్తి చేశారన్నారు.రాజమండ్రిలోని జీఎస్ కె ఎం లా కాలేజీ నుండి న్యాయవాద శాస్త్ర పట్టా అందుకున్నారన్నారు.1988వ సంవత్సరంలో కాకినాడ బార్ కౌన్సిల్ సభ్యుడిగా,న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారని తెలిపారు.1994లో ఏపీ జ్యుడీషియల్ సర్వీసెస్ లో ఉత్తీర్ణులై జిల్లా మున్సిఫ్ మేజిస్ట్రేట్ గా ఎంపికయ్యారన్నారు.జస్టిస్ చక్రవర్తి జిల్లా మరియు సెషన్స్ జడ్జిగా వివిధ బాధ్యతలకు సమర్థవంతంగా నిర్వహించారనని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ పేర్కొన్నారు.మార్చి 2024లో హై కోర్టు శాశ్వత న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారని పేర్కొన్నారు.పదవీ విరమణ అనంతరం జస్టిస్ చక్రవర్తి శేష జీవితం ఆయురారోగ్యాలతో గడవాలని కోరుకుంటున్నామని హై కోర్టు ప్రధాన న్యాయమర్తి జస్టిస్ లీసా గిల్ అన్నారు. ఈకార్యక్రమంలో హైకోర్టుకు చెందిన న్యాయమూర్తులు,అడిషినల్ అడ్వకేట్ జనరల్, పబ్లిక్ ప్రాసిక్యూటర్,న్యాయవాదులు జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తికి అభినందనలు తెలిపారు. ఇంకా పలువురు రిజిస్ట్రార్లు,బార్ అసోసియేషన్,బార్ కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తుది దశకు అయోధ్య రామమందిర సీఈఓ ఎంపిక ప్రక్రియ!

అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కోసం పూర్తిస్థాయి ప్రధాన కార్యనిర్వాహక అధికారి (సీఈఓ) ఎంపిక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఈ పోస్టు కోసం మొత్తం 5,585 దరఖాస్తులు రాగా, అందులో మొదటిగా 16 మందిని సెర్చ్ కమిటీ షార్ట్‌లిస్ట్ చేసింది. ఇప్పుడు ఆ పదహారు మంది నుంచి ముగ్గురి పేర్లను ఎంపిక చేసి, సెర్చ్ కమిటీ తమకు పంపుతుందని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ వెల్లడించింది. "షార్ట్ లిస్ట్ చేసిన పదహారు మంది అభ్యర్థుల పనితీరును సమీక్షించి, సెర్చ్ కమిటీ ముగ్గురు అభ్యర్థులను ఎంపిక చేస్తుంది. ఆ అభ్యర్థుల జాబితాను తగిన సమయంలో ట్రస్టుకు తెలియజేస్తుంది. దీనిపై ట్రస్ట్ తుది నిర్ణయాన్ని ప్రకటిస్తుంది" అని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తెలిపింది.

**ఇంటర్వ్యూలు**

రిటైర్డ్ జస్టిస్ పర్మోద్ కోహ్లీ, రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ వీకే చతుర్వేది, అణుశాస్త్రవేత్త డాక్టర్ సురేశ్ హవ్రేలతో కూడిన సెర్చ్ కమిటీ సీఈఓ ఎంపిక కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ప్రాంగణంలో ఆగస్టు 11, 12 తేదీల్లో ఈ ఇంటర్వ్యూలు నిర్వహించింది. సెర్చ్ కమిటీ తెలిపిన వివరాల ప్రకారం, సీఈఓ పోస్టు కోసం మొత్తం 5,585 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 3,877 మంది అభ్యర్థులు తమ పూర్తి వివరాలతో కూడిన కవర్ లెటర్స్ (సీవీ) సమర్పించారు. నమొదటి దశలో నిర్వహణ సామర్థ్యం, భారీ స్థాయి కార్యక్రమాలను, సిబ్బందిని నిర్వహించడంలో అనుభవం, వ్యక్తిగత నైపుణ్యం, భాషా ప్రావీణ్యం, భవిష్యత్తు దృక్పథం, వ్యూహాత్మక ప్రణాళిక వంటి అంశాల ఆధారంగా అభ్యర్థులను వడపోశారు. రెండో దశలో అభ్యర్థులు సమర్పించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, సుమారు 111 మంది అభ్యర్థులను ఆన్?లైన్?లో ఇంటర్వ్యూలకు ఆహ్వానించారు. వారి కమ్యునికేషన్ నైపుణ్యాలు, వృత్తిపరమైన అనుభవం, దృక్పథం, వ్యక్తిత్వం, నాయకత్వ లక్షణాలు, సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలను ఇందులో అంచనా వేశారు. మూడో దశలో ముఖాముఖి ఇంటర్వ్యూల కోసం 16 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. ఈ ఫైనలిస్టుల్లో ఆర్మీలో పనిచేసిన మాజీ సైనికులు, పదవీ విరమణ చేసిన ఐఏఎస్, ఐపీఎస్? అధికారులు, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల్లో పనిచేసిన నిపుణులు సహా విభిన్న నేపథ్యాలకు చెందిన నిష్ణాతులున్నారు. ప్రపంచంలోనే అత్యంత ప్రాముఖ్యత కలిగిన సంస్థకు ప్రధాన కార్యనిర్వహణాధికారి (సీఈఓ) పారదర్శకంగా ఎంపిక చేయడమే ఈ ప్రక్రియ ప్రధాన లక్ష్యమని కమిటీ పేర్కొంది.

**మూడేళ్ల కాంట్రాక్ట్**

ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఈ ట్రస్ట్ సీఈఓను మూడేళ్ల కాంట్రాక్ట్‌పై నియమిస్తారు. పనితీరు ఆధారంగా ఈ పదవీ కాలాన్ని పునరుద్ధరించే అవకాశం ఉంది. అయితే ఈ పదవికి సంబంధించిన జీతం, ఇతర ప్రయోజనాలను చర్చల ద్వారా నిర్ణయిస్తారు. ట్రస్ట్ ప్రత్యక్ష నిర్వహణలో పనిచేస్తూ, సీఈఓ పరిపాలన బాధ్యతలు నిర్వహిస్తారు. ఆర్థిక విషయాల్లో పారదర్శకతను పాటిస్తారు. ప్రభుత్వ ఏజెన్సీలతో భద్రతా ఏర్పాట్లను సమన్వయం చేస్తారు. మతపరమైన ఆచారాలు, పండుగలను పర్యవేక్షిస్తారు. భక్తుల భద్రతను, సౌకర్యాలను చూసుకుంటారు. విశిష్ట అతిథుల కోసం ఏర్పాట్లు చేస్తారు. ట్రస్ట్ రోజువారీ కార్యకలాపాలను కూడా పర్యవేక్షిస్తారు.

**ఇంతకీ ఏం జరిగింది?**

అయోధ్య రామమందిరానికి వచ్చిన విరాళాలు చోరీకి గురయ్యాయని, కానుకల నిర్వహణలో అవకతవకలు, నిధుల దుర్వినియోగం జరిగిందనే ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆలయ నిర్వహణ కోసం ప్రధాన కార్యనిర్వాహణ అధికారి (సీఈఓ)ను నియమించాలని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే సెర్చ్ కమిటీ సీఈఓ ఎంపిక ప్రక్రియ చేపట్టింది. కాగా, అయోధ్య రామమందిర విరాళాల చోరీపై జూన్?లో ఎఫ్?ఐఆర్? నమోదైంది. ఇప్పటి వరకు ఈ కేసులో కనీసం 8 మందిని అరెస్టు చేశారు.

## ప్రతి కేసుకు ఒకే టైమ్‌పీరియడ్ సాధ్యం కాదు

దేశవ్యాప్తంగా పెరుగుతున్న కేసుల పెండింగ్ సమస్యకు పరిష్కారం చూపేందుకు ప్రత్యేక

# రాప్తాడు కస్తూరిబా, మోడల్ పాఠశాలల్లో కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత





**అంకుశం న్యూస్, అనంతపురం, ఆగస్టు : 14** విద్యార్థి దశ నుంచే దేశభక్తితో పాటు క్రమశిక్షణ పెంపొందించుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. తిరంగా యాత్రలో భాగంగా ఆమె రాప్తాడులోని కస్తూరిబా, మోడల్ పాఠశాలలకు వెళ్లారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఆమెకు ఘన స్వాగతం పలకగా వారితో కలసి త్రివర్ణ పతాకాలతో ర్యాలీ నిర్వహించారు. వందేమాతరం, భారత్ మాతాకీ జై, జై జవాన్ జై కిసాన్ అన్న నినాదాలతో ర్యాలీ సాగింది. అనంతరం మోడల్ పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి సుమారు 200 మొక్కలు నాటారు. అనంతరం పాఠశాలను, విద్యార్థులకు వంట చేయు ప్రదేశాన్ని పరిశీలించారు. ప్రహరీ గోడ అసంపూర్తిగా నిలిచిపోవడం, వంటగది లేకపోవడం, పాఠశాల ఆవరణలో ఫ్లోరింగ్ మరమ్మతులకు గురికావడం, నూతన ప్లాట్ ఫార్మ్ నిర్మాణం, బాత్ రూముల మరమ్మతుల సమస్యల్ని ఎమ్మెల్యే సునీత దృష్టికి తీసుకొచ్చారు. జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా ఈ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ పిలుపు మేరకు రామగిరి మండలం వెంకటాపురంలోని తన నివాసంపై జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుల పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్ని అత్యంత ఘనంగా నిర్వహించడంతో పాటు మన దేశ ప్రజల ఐక్యతను చాటే విధంగా కార్యక్రమాలు చేయాలన్నారు. విద్యార్థులు ప్రధానంగా ఇందులో కీలక భాగస్వాములు కావాలన్నారు. భవిష్యత్ తరాలకు మీరు వారధిగా ఉంటూ ఆ మహనీయులు సాధించిన విజయాలను ప్రతి ఒక్కరికీ చాటి చెప్పాలన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాయదుర్గంలో 200 అడుగుల భారీ జెండాతో విద్యార్థుల ర్యాలీ...

**అంకుశం న్యూస్, రాయదుర్గం, ఆగస్టు : 14** దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్ల పూర్తయిన సందర్భంగా అనంతపురం జిల్లా రాయదుర్గం పట్టణంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భారీ జాతీయ జెండా ర్యాలీ నిర్వహించారు. కనేకల్ రోడ్డు నుంచి ప్రారంభమైన ర్యాలీ లక్ష్మీ బజార్ మీదుగా వినాయక సర్కిల్ వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో 200 అడుగుల పొడవైన భారత జాతీయ జెండా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు, యువత భుజాలపై జెండాను మోస్తూ "వందేమాతరం.. స్వతంత్ర భారత్‌కి జై" అంటూ, మహాత్మా గాంధీ, భగత్ సింగ్, నేతాజి సుభాష్ చంద్రబోస్, చంద్రశేఖర్ ఆజాద్ లకు జేజేలు పలుకుతూ నినాదాలు చేశారు. ప్రభుత్వ మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల జూనియర్ కళాశాల, వెంకటేశ్వర ప్రైవేట్ జూనియర్ కళాశాల తదితర విద్యాసంస్థల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దీంతో పట్టణంలో దేశభక్తి వాతావరణం నెలకొంది.



ఈ సందర్భంగా.ఏఐఎస్ఎఫ్, అనంతపురం జిల్లా కోశాధికారి ఆంజనేయులు, ఏఐవైఎఫ్ అనంతపురం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కావలి కోట్రేష్ మాట్లాడుతూ, 1936 ఆగస్టు 12న లక్నోలోని బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భవించిందని గుర్తు చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో వేలాది మంది విద్యార్థులు అమరులయ్యారని తెలిపారు. 1947 ఆగస్టు 15న రాజకీయ స్వాతంత్ర్యం వచ్చినా, 80 ఏళ్ల తర్వాత కూడా ఈ దేశంలో పేదరిక నిర్మూలన, నిరుద్యోగం, విద్య-వైద్యం ప్రైవేటీకరణ, ఆడపిల్లలపై అత్యాచారాలు, ఆకలి చావులు ఇంకా కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

# లోపలికి రాలేని దివ్యంగురాలి వద్దకే స్వయంగా వెళ్ళి అర్జీ స్వీకరించిన ఎమ్మెల్యే

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యత
మండపేట టీడీపీ కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక
ఒకే రోజులోనే 104 అర్జీలు స్వీకరణ...



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఆగస్టు 14:** రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు స్పష్టం చేశారు. శుక్రవారం మండపేట పట్టణంలోని స్థానిక తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ నలుమూలల నుంచి విచ్చేసిన వందలాది మంది ప్రజల నుంచి ఎమ్మెల్యే స్వయంగా వినతులు స్వీకరించి, వారి సమస్యలను ఓపికగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ సమస్యలపై మొత్తం 104 అర్జీలు వచ్చాయి. ఇందులో హౌసింగ్ లోన్ కు సంబంధించి 28, ఇళ్ల స్థలాల కోసం 22, రెవెన్యూ సమస్యలు 11, ఎడ్యుకేషన్ 5, నేతన్న సేవలో 5, ఎలక్ట్రికల్ 3, రోడ్లు, డ్రైన్లు 3, ఇరిగేషన్ 2, ఇతర సమస్యలకు సంబంధించి 25 అర్జీలు వచ్చాయి. వచ్చిన అర్జీలు స్వీకరిస్తున్న సమయంలో ఏడిద గ్రామానికి చెందిన ఒక దివ్యాంగురాలు తన సమస్యను చెప్పుకునేందుకు వచ్చి, లోపలికి రాలేక వెలుపలే ఆటోలో ఉండి ఇబ్బంది పడుతోంది. ఈ విషయాన్ని గమనించిన ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు గారు వెంటనే స్పందించి స్వయంగా ఆమె వద్దకే వెళ్ళారు. ఆమె పరిస్థితిని అడిగి తెలుసుకుని, అర్జీని స్వీకరించారు. తప్పకుండా సమస్య పరిష్కరిస్తా అని ఎమ్మెల్యే ఆమెకు చెప్పారు. బాధితులు విన్నవించిన పలు సమస్యలపై ఎమ్మెల్యే తక్షణమే స్పందించారు. సంబంధిత శాఖల అధికారులకు ఫోన్ చేసి మాట్లాడి కొన్ని సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపించారు. మిగిలిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు పంపి, బాధ్యతాయుతంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ళ మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, వారు ఎదుర్కొంటున్న సమస్యలకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ఈ వేదికలను నిర్వహిస్తోందని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ సుపరిపాలన అందించడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

## మాజీ ఎమ్మెల్యేని పరామర్శించిన మాజీ హోంమంత్రి తానేటి వనిత, జక్కంపూడి రాజా, డాక్టర్ సత్తి గౌతమ్ రెడ్డి



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఆగస్టు 14:** ప్రమాదానికి గురై గాయాలతో డాక్టర్ గూడూరి శ్రీనివాస్ విజయభారతి చెస్ట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న గోపాలపురం మాజీ శాసనసభ్యులు, కొవ్వూరు నియోజకవర్గం వైయస్ఆర్ సీపీ ఇంఛార్జ్ తలారి వెంకట్రావు గారిని మాజీ హోంమంత్రి తానేటి వనిత, మాజీ శాసనసభ్యులు రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు జక్కంపూడి రాజా, గౌతమ్ యూరాలజీ ఢ కిడ్నీ సెంటర్ అధినేత డాక్టర్ సత్తి గౌతమ్ రెడ్డి పరామర్శించారు. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గం ఇంఛార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పర్యవేక్షణలో చికిత్స పొందుతున్న తలారి వెంకట్రావు కోలుకుంటున్నారు. వైద్య నిపుణులు డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పర్యవేక్షణలో వైద్య నిపుణులు డాక్టర్ పెరుమాళ్ళు, డాక్టర్ సత్తి గౌతమ్ రెడ్డి కూడా తలారికి వైద్య సేవలు అందిస్తున్నారు. మాజీ హోం మంత్రి తానేటి వనిత, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు రాజానగరం మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజాకు మాజీ ఎమ్మెల్యే తలారి ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్ గూడూరి శ్రీనివాస్, డాక్టర్ సత్తి గౌతమ్ రెడ్డి వివరించారు. మాజీ ఎమ్మెల్యే తలారి కుటుంబ సభ్యులను కూడా తానేటి వనిత, జక్కంపూడి రాజా, డాక్టర్ సత్తి గౌతమ్ రెడ్డి పరామర్శించారు. తలారి వెంకట్రావు త్వరితగతిన కోలుకొని యధావిధిగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆశిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా పరామర్శించిన వారిలో పార్టీ సీనియర్ నాయకులు కొవ్వూరి త్రినాథ్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి తోట రామకృష్ణ, రైతు నాయకులు రాజా, చాగల్లు మండల పార్టీ అధ్యక్షులు మట్టా వెంకట్రావు, తదితరులున్నారు.

## దారపనేని వారి నిశ్చయ తాంబూలాల కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఏఎంసి చైర్మన్ చంద్రశేఖర్



**కనిగిరి ఆగస్టు 14 అంకుశం న్యూస్** కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం తూర్పు కోడిగుడ్లపాడు గ్రామ వాస్తవ్యులు దారపనేని కృష్ణ, సునీత దంపతుల కుమారుడు దారపనేని రూపేష్ చంద్ర, మానసల నిశ్చితార్థ వేడుకలు శుక్రవారం గుంటూరులోని ఉడ్ ల్యాండ్ హోటల్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ నిశ్చితార్థ వేడుకల్లో ముఖ్యఅతిథిగా కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పాల్గొని వధూవరులను అక్షింతలతో ఆశీర్వదించారు. ఎం సి కె దుర్గాప్రసాద్ అండ్ బ్రదర్స్, దారపనేని హరిబాబు, తిరివీధి కేశవరావు (ఆటోమొబైల్ ఫైనాన్సర్, విజయవాడ), దారపనేని జగదీష్, తిరివీధి కేశవరావు (రమా హోటల్స్, కర్నూల్), దారపనేని సూర్యనారాయణ, దారపనేని కృష్ణ,నూతంగి నారాయణ రావు, నరసింహారావు, సూర్యనారాయణ, మేడసాని ప్రసాద్ (రిటైర్డ్ టీచర్) నాగమల్లేశ్వరరావు, బాల, మేడసాని కేశవులు, చెన్నయ్య, చిన్న కృష్ణయ్య, వెంగయ్య, మేడ సాని వారి కుటుంబ సభ్యులు, దారపనేని వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు భారీ సంఖ్యలో పాల్గొని వధూవరులను అక్షింతలతో ఆశీర్వదించిన వారిలో ఉన్నారు.

## పాండురంగస్వామి ఆలయ పునఃనిర్మాణ కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్

**టీడీపీ కార్యాలయంపై జాతీయ జెండా ఎగురవేసిన శ్రీరామ్**





**అంకుశం న్యూస్ ధర్మవరం ఆగస్టు 14** ధర్మవరం తెలుగుదేశంపార్టీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ నియోజకవర్గంలో జరిగిన పలు ఆధ్యాత్మిక, దేశ భక్తి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా ధర్మవరం పట్టణంలోని పురాతన పాండురంగ స్వామి ఆలయ పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. ముందుగా శ్రీరామ్ కు ఆలయ అర్చకులు, అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించిన శిలాఫలక ఆవిష్కరణలో పాలొన్నారు. అక్కడ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు ప్రత్యేకంగా ఆశీర్వచనాలు అందజేశారు. మొత్తం రూ. 1.25 కోట్లతో ఈ పనులు చేపట్టినామని నిర్వాహకులు తెలిపారు. సుమారుగా 8 దశాబ్ధాల చరిత్ర కల్గిన ఆలయ పునర్నిర్మాణం జరుగుతుండటం చాలా సంతోషంగా ఉందని ఈ సందర్భంగా శ్రీరామ్ అన్నారు. ఆ పాండురంగస్వామి ఆశీస్సులు పట్టణ ప్రజలపై ఉండాలని.. ఆలయం అద్భుతంగా నిర్మాణం జరగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం అనంతరం ధర్మవరం మండలం కామిరెడ్డిపల్లి గ్రామంలో శ్రీ అహోభిలేశ్వరస్వామి నాగుల ప్రతిష్ఠామహోత్సవ కార్యక్రమంలో కూడా శ్రీరామ్ పాల్గొన్నారు. అర్చకులు, గ్రామస్థులు శ్రీరామ్ కు ఘన స్వాగతం పలుకుతూ ఆలయానికి ఆహ్వానించారు. ముందుగా ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలను వీక్షించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో అంతా సమిష్టిగా ఆలయం నిర్మించుకోవడం చాలా సంతోషకరమని.. ఆ అహోబిలేశ్వరస్వామి ఆశీస్సులు గ్రామ ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. ఆ తర్వాత హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా శ్రీరామ్ ధర్మవరం టీడీపీ కార్యాలయంపై జాతీయ జెండాను ఎగురవేశారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తమ ఇళ్లు, కార్యాలయాలపై జాతీయ జెండాలను ఎగురవేయాలన్నారు. మన దేశ సమైక్యతను చాటే విధంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని శ్రీరామ్ పిలుపునిచ్చారు..

## గ్రామీణాభివృద్ధి,ఆరోగ్యం ప్రాధాన్యతగా విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే నల్లమిల్లి



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఆగస్టు 14:** కూటమి ప్రభుత్వంలో ఆరోగ్యం, మౌలిక వసతులు, గ్రామీణ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం అనపర్తి మండలం పెడపర్తిలో రూ. 36 లక్షల వ్యయంతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అనపర్తి మండల టిడిపి అధ్యక్షులు దత్తుడు శ్రీను, తమలంపూడి సుధాకర్ రెడ్డి, కర్రి శేషారత్నం, కర్రి వెంకట రామారెడ్డి, బుల్లిరెడ్డి కూటమి నేతలు తదితరులు ఉన్నారు.

## ఎల్.ఓ.సి. పత్రాన్ని బాధిత కుటుంబానికి అందజేసిన ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్....



**అంకుశం న్యూస్ అనంతపురం ఆగస్టు : 14** ఇప్పటి వరకు 54సార్లు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించాం.. ఎమ్మెల్యే ఇందులో 1227అర్జీలు వస్తే 1179 పరిష్కరించాం, 45 పెండింగ్ లో ఉన్నాయి అర్జీల్లో ఎక్కువగా హౌసింగ్, పింఛన్ సమస్యలు ఉన్నాయి సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నా కాబట్టే అర్జీలు తక్కువగా వస్తున్నాయి 2014-19సమయంలో టిడ్కో ఇళ్లు దాదాపు పూర్తి చేశాం ఆ తర్వాత వచ్చిన గొడ్డలి పార్టీ కేవలం తమ పార్టీ రంగులు వేసుకున్నారు అసలైన లబ్ధిదారులకు అన్యాయం చేశారు మేము అధికారంలోకి వచ్చాక టిడ్కో ఇళ్లను పూర్తి చేస్తున్నాం పింఛన్లు కూడా త్వరలోనే కొత్తవి మంజూరవుతాయి ఈనెలాఖరు, వచ్చే నెలలో కొత్త పింఛన్లు ఉంటాయి మెగా డీఎస్సీపై వైసీపీ నాయకులకు అవసర రాద్ధాంతం చేస్తున్నారు 150రోజుల్లో 16347పోస్టులను అత్యంత పారదర్శకంగా భర్తీ చేశాం స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు జరిగాయంటూ నిరాధార ఆరోపణలు చేస్తున్నారు ఆధారాలు చూపించమంటే వైసీపీ నాయకులు ముందుకు రావడం లేదు అనంతపురం జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తున్నాం పుట్టపర్తిలో యుద్ధ విమానాల పరిశ్రమను తీసుకొచ్చారు ఇదంతా సీఎం చంద్రబాబు గారు, మంత్రి నారా లోకేష్ వలనే సాధ్యమన్నారు అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్.

# తిరంగా సైకిల్ యాత్రలో ముువ్వన్నెల జెండాతో యువతలో దేశభక్తి నింపేదుకు సైకిల్ ర్యాలీలో పాల్గొన్న మంత్రి సుభాష్





**విద్యార్థులు, ప్రజలతో కలిసి ఘనంగా తిరంగా ర్యాలీ**

**అమరవీరుల త్యాగాలను స్మరించుకుందాం**

**జాతీయ సమైక్యతే భారతీయుల నినాదం కావాలి**

**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఆగస్టు 14:** దేశభక్తి నినాదాలు... చేతిలో రెపరెపలాడిన జాతీయ జెండాలు... "జై హింద్" నినాదాలతో మార్మోగిన వీధులు... విద్యార్థులు, యువత, ప్రజల ఉత్సాహం... ఇలా రామచంద్రపురం నియోజకవర్గంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముందస్తు సంబరాలు అంబరాన్ని తాకాయి. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జగన్నాయకులపాలెం నుంచి ద్రాక్షారామం పంచాయతీ కార్యాలయం వరకు వివిధ పాఠశాలల విద్యార్థులు, కూటమి నాయకులు, ప్రజలతో కలిసి నిర్వహించిన భవ్యమైన తిరంగా ర్యాలీ దేశభక్తి స్ఫూర్తిని చాటింది. జాతీయ జెండాతో సైకిల్‌పై మంత్రి వాసంశెట్టి సుభాష్ స్వయంగా ర్యాలీలో పాల్గొని విద్యార్థులు, యువతలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ...యువత దేశ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే శక్తిగా ఎదిగి, భారతదేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే దేశభక్తి, జాతీయ భావం, సామాజిక బాధ్యతలను పెంపొందించేందుకు తిరంగా ర్యాలీల వంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని మంత్రి సుభాష్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి భావాన్ని చాటాలని ప్రజలకు పిలుపునిచ్చారు. జాతీయ పతాకం కేవలం ఒక జెండా కాదు... ప్రతి భారతీయుడి ఆత్మగౌరవానికి, దేశ సార్వభౌమత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రతి గ్రామంలో, ప్రతి పట్టణంలో ఘనంగా నిర్వహించి దేశభక్తి స్ఫూర్తిని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అమరవీరుల త్యాగం చిరస్మరణీయం... "స్వచ్ఛ భారత్ -- వికసిత్ భారత్" మన లక్ష్యం. గ్రామం నుంచి పట్టణం వరకు, జిల్లా నుంచి రాష్ట్రం వరకు, రాష్ట్రం నుంచి దేశం వరకు అభివృద్ధి పథంలో భారత్ మరింత ముందుకు సాగాలని మంత్రి ఆకాంక్షించారు. తిరంగా ర్యాలీ మార్గమధ్యంలో మహాత్మా గాంధీ, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాలకు మంత్రి వాసంశెట్టి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్ రాయ్, రేవు శ్రీను తదితర కూటమి పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. వారి సేవలను, దేశం కోసం వారు చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం విద్యార్థులకు పండ్లు పంచారు.

ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్, కూటమి పార్టీ సీనియర్ నేత వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్ రాయ్, మండల పరిషత్ అధికారిణి పద్మజ్యోతి, పట్టణ సీఐ వెంకటనారాయణ, ఎస్ఐ లక్ష్మణ్, రూరల్ మండల టీడీపీ అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు, పట్టణ అధ్యక్షులు ఉండవల్లి శివ, గంగవరం మండల అధ్యక్షులు మేడిశెట్టి రవికుమార్, స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, పెంకే సాంబశివరావు, కడియాల రాఘవన్, కంచుమర్తి బాబురావు తదితర కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు, దేశభక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ జెండాతో తమ దేశభక్తిని చాటుకున్నారు.

# ద్రాక్షారామ భీమేశ్వర ఆలయానికి విచ్చేసిన అన్నా కొణిదెలకు ఘన స్వాగతం

## ఆలయ మర్యాదలతో ఆహ్వానించిన మంత్రి వాసంశెట్టి సుభాష్, ఈవో అల్లువెంకటదుర్గాభవాని

**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఆగస్టు 14:** శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా ద్రాక్షారామ శ్రీ మాణిక్యాంబా సమేత శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సతీమణి శ్రీమతి అన్నా కొణిదెల సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆమెకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఆలయ ఈవో అల్లు వెంకట దుర్గా భవాని ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ ఘనంగాస్వాగతం పలికి ఆహ్వానించారు.అనంతరం మంత్రి సుభాష్ ఆలయ మర్యాదలతో అన్నా కొణిదెలను ఆలయంలోకి తీసుకువెళ్లి, శ్రీ మాణిక్యాంబా అమ్మవారు మరియు శ్రీ భీమేశ్వర స్వామివారికి నిర్వహించిన ప్రత్యేక పూజలు, కుంకుమార్చన కార్యక్రమాల్లో పాల్గొనేలా ఏర్పాట్లు చేశారు. శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పూజా కార్యక్రమాల అనంతరం బేడా మండపం లో వేద పండితులు, అర్చకులు శ్రీమతి అన్నా కొణిదెలకు ఆశీ





ర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకుడు సంపత్ దంపతుల కుమారుడికి యక్షిత్ ఓంకార్ గా అన్నా కొణిదెల నామకరణం చేసి, పసిబాలుడితో ఆప్యాయంగా ముద్దాడారు. దేవస్థానానికి విచ్చేసిన అన్నా కొణిదెలకు ఆలయ సంప్రదాయాల ప్రకారం మంత్రి వాసంశెట్టి సుభాష్, దేవస్థానం ఈవో శ్రీమతి అల్లువెంకట దుర్గాభవాని కలిసి పట్టు వస్త్రాలు, శ్రీ స్వామివారి చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు. దేవస్థానం ఈవో దుర్గాభవాని, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, వేద పండితులు, జనసేన నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# జిల్లాకు కరువు కొత్త కాకపోయినా ఈసారి మాత్రం పరిస్థితులు దారుణంగా ఉన్నాయి

## మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి....

**అంకుశం న్యూస్,అనంతపురం, ఆగస్టు : 14** అనంతపురం జిల్లాకు కరువు కొత్త కాకపోయినా ఈసారి మాత్రం దారుణ పరిస్థితులు ఉన్నాయని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. ఓ వైపు సాగు చేసిన పంటలు చేతికొచ్చే పరిస్థితులు లేవని.. మరోవైపు పశువులకు పశుగ్రాసం కొరత తీవ్రం కానుందని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జూన్‌లో వర్షాలు కురవలేదని, జూలైలో 70 శాతం లోటు వర్షపాతం నమోదైందన్నారు. ఆగస్టులో ఇప్పటి వరకు వర్షాలు లేవని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా భూగర్భజలాలు అడుగంటిపోయాయని, చాలా ప్రాంతాల్లో 40 మీటర్లకు పడిపోయినట్లు చెప్పారు. తాగునీటితో పాటు పశువులకు నీరు, గ్రాసం లభించడం లేదని.. ప్రభుత్వం మాత్రం కేవలం ప్రకటనలకే పరిమితం అవుతోందన్నారు. సాధారణంగా జిల్లాలో ఖరీఫ్ సాగు విస్తీర్ణం 8.48 లక్షల ఎకరాలుంటే 4 లక్షల ఎకరాలకు పైబడి విత్తనం వేయలేదని తెలిపారు. వేరుశనగ, కంది, ఆముదం, పత్తి పంటలు వేసినా అవి చేతికొచ్చే పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదని తెలిపారు. ఇప్పటికే పంట సాగు సన్నద్ధం కోసం పంట రకాన్ని బట్టి ఎకరాకు రూ.3 వేల నుంచి రూ.6 వేల వరకు రైతులు ఖర్చు చేశారని గుర్తు చేశారు. ఈ ఖరీఫ్‌లో రెండున్నర నెలలు గడిచిపోయాయని, వేసిన పంటలు ఎండిపోతున్నట్లు తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో ఉచిత పంటల బీమా అమల్లో ఉండేదని, ఈ ప్రభుత్వం మాత్రం రైతుల నుంచి ప్రీమియం కట్టించుకుంటోందని తెలిపారు. వాతావరణ బీమా ప్రీమియం చెల్లింపునకు గడువు ముగిసిపోగా ఫసల్ బీమా ప్రీమియం చెల్లింపు గడువు ఆగస్టు 15వ తేదీతో ముగుస్తోందన్నారు. ఇప్పటికే జిల్లా రైతాంగం 8.20 లక్షల ఎకరాలకు బీమా చేయించారని, కానీ పంట సాగులోకి వచ్చింది మాత్రం 4.10 లక్షల ఎకరాలకు మాత్రమేనని తెలిపారు. ప్రస్తుతం వేరుశనగ, కంది, ఆముదం, పత్తి పంటలు వేసుకునే పరిస్థితి




లేదని సాక్షాత్తూ వ్యవసాయ శాఖ అధికారులే చెబుతున్నారని తెలిపారు. మరోవైపు జిల్లాలో 40 లక్షల వరకు పశుసంపద ఉందని, ఇందులో ఎద్దులు 2 లక్షలు, గేదెలు 1.80 లక్షలు, గొర్రెలు 30 లక్షల వరకు ఉన్నాయని తెలిపారు. ఒక్కో పశువుకు రోజుకు 30 కిలోల వరకు గ్రాసం అవసరం అవుతుందని, కానీ క్షేత్రస్థాయిలో పశుగ్రాసం కొరత తీవ్రంగా ఉందని తెలిపారు. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా ఉమ్మడి జిల్లాలోని ముగ్గురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం మాత్రం కనీసం ఒక్క సమీక్ష చేసిన పాపాన పోలేదని అన్నారు. మంత్రి పయ్యావుల కేశవ్ ఆర్‌అండ్‌బీలో, సత్యకుమార్ యాదవ్ ధర్మవరంలో.. సవితమ్మ పెనుకొండలో నామమాత్రపు సమావేశాలు పెట్టుకుంటున్నారని చురకలంటించారు. తమ నియోజకవర్గాల్లోని పరిస్థితులను ఎమ్మెల్యేలు కూడా పట్టించుకోవడం లేదని అన్నారు. జిల్లా రైతాంగానికి ఆత్మస్థైర్యం ఇచ్చేలా వ్యవసాయ, అనుబంధ శాఖలపై కనీసం సమీక్ష చేసే తీరిక మీకు లేదా? అని ప్రశ్నించారు. ఇప్పటికే రైతుల ఆత్మహత్యలు, వలసలు పెరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో బిల్డింగులు, రోడ్డు పనులు పేరుతో ప్రచారం చేసుకోవడం తప్పితే కరువుపై దృష్టిపెట్టలేరా? అని అన్నారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులకు తమ రాజకీయాలు, వ్యక్తిగత ఆదాయ మార్గాలకే పదవులు ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ప్రతి శని, ఆదివారాల్లో పెద్ద ఎత్తున మార్కెట్ యార్డులకు పశుసంపద తరలిపోతోందని, అయినా ప్రజాప్రతినిధులకు చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. 2024 ఖరీఫ్, రబీతో పాటు 2025 ఖరీఫ్‌కు సంబంధించి బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ రాలేదన్నారు. 2024 ఖరీఫ్ బీమా విడుదలైందని చెబుతున్నా రాష్ట్రం తన వాటాను చెల్లించలేదని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో పంటల బీమాను అస్తవ్యస్తంగా మార్చేశారని మండిపడ్డారు. 2023 ఏడాది చివరి నుంచి ఇప్పటి వరకు 200 మంది వరకు రైతులు ఆత్మహత్య చేసుకుంటే పరిహారం మాత్రం ఆ కుటుంబాలకు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భజలాలు పడిపోతున్న నేపథ్యంలో మోటార్ల కెపాసిటీ పెంచుకోవాలంటే కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వడం లేదని తెలిపారు. జిల్లాలో 3700 నుంచి 4000 ట్రాన్స్‌ఫార్మర్లు అవసరం ఉన్నా పట్టించుకునే నాథులు లేరన్నారు. ఎమ్మెల్యేలు చెబితేనో.. ముడుపులు ఇచ్చుకుంటేనో ట్రాన్స్‌ఫార్మర్లు ఇచ్చే పరిస్థితి నెలకొందని తెలిపారు.

## మాజీ మంత్రి జేసీ దివాకర్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ....



**అంకుశం న్యూస్, అనంతపురం, ఆగస్టు : 14** మాజీ మంత్రి జేసీ దివాకర్ రెడ్డి ఆరోగ్య పరిస్థితి, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే జేసీ ప్రభాకర్ రెడ్డిని కలిసి, తాడిపత్రి నియోజకవర్గంలో మహిళా సాధికారత కోసం చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాలు, మహిళల ఆర్థిక స్వావలంబన, స్వయం ఉపాధి అవకాశాలు, మహిళలకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి చర్చించారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి అన్ని రంగాల్లో ముందుకు సాగేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. మహిళా సాధికారతతోనే కుటుంబాలు, సమాజం మరింత అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. అలాగే ఈ సందర్భంగా తాజా రాజకీయ పరిస్థితిపై దివాకర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి తో శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, చర్చించారు.

## జర్నలిస్టుల యూనియన్ ఆధ్వర్యంలో భారీ జాతీయ జెండాతో ర్యాలీ హాజరైన మనోజ్



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఆగస్టు 14:** జాతీయ జెండా ఖ్యాతి,జాతి గౌరవం ప్రజల్లో మరింత పెంపొందించడం తో పాటు దేశభక్తి భావాన్ని చాటే లక్ష్యంతో రంగంపేట జర్నలిస్టుల యూనియన్ ఆధ్వర్యంలో భారీ జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం జర్నలిస్టుల యూనియన్ ఆధ్వర్యంలో 330 అడుగుల భారీ జాతీయ జెండాను మండల కేంద్రం రంగంపేటలోని ప్రధాన పురవీధుల్లో ప్రదర్శించారు. ఎస్వీఎస్ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి ప్రారంభమైన ర్యాలీ గాంధీ సెంటర్ వరకు కొనసాగింది. ఈ ర్యాలీ రంగంపేట లో ప్రత్యేక ఆదర్శంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో అనపర్తి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ నల్లమిల్లి మనోజ్ రెడ్డి, ఆళ్ళ గోవిందు, వెలుగుబంటి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొన్న కదిరి గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు



**అంకుశం న్యూస్,కదిరి,ఆగస్టు:14:** శుక్రవారం కదిరి గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో డి ఎస్ టి డబ్ల్యూ ఈ ఓ ఆదేశాలు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించిన కదిరి గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు.ఈ కార్యక్రమంలో సత్య సాయి జిల్లా డి ఎస్ టి డబ్ల్యూ ఈవో, పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి ఉపేంద్ర,ఇతర ఉపాధ్యాయులు,విద్యార్థులు అందరూ పాల్గొనడం జరిగింది.విద్యార్థులు అత్యుత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

### అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపు



**అంకుశం న్యూస్,అనంతపురం, ఆగస్ట్:14 :** మన జాతీయ పతాకం భారతదేశ ప్రతిష్టకు, ఆత్మగౌరవానికి నిదర్శనమని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఎగురవేయాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు.తన నివాసంపై జాతీయ జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు,ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు,టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ టిడిపి నాయకులు పాల్గొన్నారు.అనంతరం జెండాకు అభివాదం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ,ముఖ్యమంత్రి చంద్రబాబు,ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పిలుపుమేరకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించే 'హర్ ఘర్ తిరంగా' రాష్ట్రమంతా కనిపిస్తోందన్నారు. ప్రజలంతా ఉత్సాహంతో పాలుపంచుకుంటు న్నారన్నారు. ముువ్వన్నల జెండా భారతీయులు అందరికీ నిరంతరం నూతన ప్రేరణను అందిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. 2047 లక్ష్యాల సాధనలో ప్రతి పౌరుడినీ భాగస్వామిని చేస్తూ వికసిత్ భారత్-స్వర్ణాంధ్ర లక్ష్యాలపై ప్రజల్లో చైతన్యం కల్పించే ఈ విధంగా కార్యక్రమాన్ని చేపట్టారన్నారు.ప్రతీ ఒక్కరూ తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి మన ఉమ్మడి ఐక్యతను చాటాలని ఎమ్మెల్యే కోరారు.అలాగే స్వాతంత్ర సమరయోధులను స్మరించుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ స్టోర్ చైర్మెన్ బోయపాటి శ్రీనివాసులు, టిడిపి నగర ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, టిడిపి నాయకులు రాయల్ మధు, దలవాయి వెంకటనారాయణ, జోగి రాజేంద్రలు పాల్గొన్నారు.